క్లుప్తంగా

'సమాచారం'లో పోలీసుల నిర్లక్ష్యం



ముద్దనూరు పోలీసుస్టేషన్‌లో సమాచార లోపంతో వున్న బోర్డు

ముద్దనూరు : సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చి రెండున్నర దశాబ్దాలు గడుస్తున్నప్పటికీ చట్టం అమలు మాట అటుంచితే సమాచారం కనీసం సూచిక బోర్డులలో కూడా అమలుకావడంలేదు. స్థానిక అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమాచార హక్కు చట్టం సూచిక బోర్డులో సమాచారం లోపం స్పష్టంగా కనబడుతోంది. అప్పిలేట్ అధికారి మారి నెలలు గడిచినా బోర్డులో మాత్రం అప్పిలేట్ అధికారి పేరు మార్చకపోవడం గమనార్హం. అప్పటి అప్పిలేట్ అధికారి, డీఎస్పీ యశ్వంత్ తర్వాత ఇద్దరు డీఎస్పీలు బాధ్యతలు చేపట్టారు. పోలీసు అధికారులు స్పందించి ఇప్పటికైనా సమాచారిన్ని సరిదిద్దాలని కోరుతున్నారు.

బకాయిలు విడుదల చేయాలి


పాత బస్టాండ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

జమ్మలమడుగు : విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రిఎంబర్సుమెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి అరవింద్ డిమాండ్ చేశారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రిఎంబర్సుమెంట్ ఇవ్వకపోవడంతో కాలేజి యాజమాన్యం విద్యార్థులకు నోటీసుల జారీ చేసి ఫీజులు కట్టాలంటూ వేధించడం జరుగుతుందన్నారు. యువగళం పేరుతో లోకేష్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండ ఫీజు రిఎంబర్సుమెంట్ అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థులకు 2100 కోట్ల రూపాయలు, 1480 కోట్ల రూపాయలు వసతి దీవెన పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే ఆ నిధులను విడుదల చేయాలన్నారు.

కడప జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షుడిగా హృషికేశవరెడ్డి



జమ్మలమడుగు : కడప జిల్లా మున్సిపల్ విభా గం అధ్యక్షుడిగా హృషికేశవరెడ్డిని నియమించినట్లు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. జిల్లాలో మున్సిపల్ పరిధిలో వైఎస్సార్‌సీపీ బలోపేతం చేయటానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

జూదరుల అరెస్ట్

చింతకొమ్మదిన్నె : మండలంలోని స్వామినగర్ సమీపంలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్దనుంచి రూ.6770 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్టకు సర్వం సిద్ధం


ప్రారంభానికి సిద్ధం చేసిన యాగశాల

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతారాముల విగ్రహాలను ప్రతిష్టించేందుకు సర్వం సిద్ధం చేశారు. ఈనెల 23 నుంచి 25 వరకు ఆలయంలో హోమాలు, పూజలు, ప్రాణ ప్రతిష్ట ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

కానుకల పంపిణీ


కానుకలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధి ఇల్లూరు గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులు 60 కుటుంబాలకు క్రిస్మస్ కానుకలను గ్రామ సర్పంచ్ మోపూరి కృష్ణారెడ్డి, ఎం.దస్తగిరిరెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పంపిణీ చేశారు. 25 కిలోల బియ్యం ప్యాకెట్, 16 రకాల నిత్యావసర సరకులను ఇంటింటికీ పంపిణీ చేశామని దస్తగిరిరెడ్డి తెలిపారు.

పత్తిరైతు కుదేలు

- గిట్టుబాటు ధర లేక నష్టం
- ప్రభుత్వమే ఆదుకోవాలని విన్నవం


కొట్టాలపల్లెలో తెగుళ్లు సోకిన పత్తి పంట

కొండాపురం : ఖరీఫ్ సీజన్‌లో ఎంతో ఆశతో పత్తి పంటను రైతులు సాగుచేశారు. మొదట్లో పంట ఆశాజనకంగా ఉన్నా తర్వాత వాతావరణం అనుకూలించక పత్తిపొలంలో పూతలు రాలిపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర వచ్చే ఆశకాశం లేదని పత్తి రైతులు వాపోతున్నారు. మండలంలోని వెంకయ్యకాలువ, చెన్నమనేనిపల్లె, లావనూరు, కొట్టాలపల్లె, పలు గ్రామాల్లో అధికంగా పత్తిపంట సాగుచేశారు. మండలంలో సుమారు 800 ఎకరాల్లో పత్తిసాగు చేశారు.


వెంకయ్యకాలులో సాగు చేసిన పత్తిపంట

పెట్టుబడి దక్కని పరిస్థితి

పత్తి వేయడానికి ఎకరాకు దాదాపు రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు పెట్టుబడిపెట్టారు. వర్షాలతోపాటు వాతావరణం సహకరించకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడి కాస్త బూడిదలో పోసిన పన్నీరులూ మారింది. పంట బాగా వస్తే ఎకరాకు దాదాపు 8 నుంచి 13 క్వింటాళ్లు దిగుబడి రావాల్సి ఉంది. ప్రస్తుతం 4 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఆరు ఎకరాల్లో పత్తి సాగుచేశా



వెంకయ్యకాలువ గ్రామంలో 7 ఎకరాల్లో పత్తిసాగు చేశాను. ఎరువులు, తెగుళ్లకు రసాయనిక మందులు పిచికారి ఖర్చు కలుపు మొత్తం ఎకరాకు రూ.35 వేలు పెట్టాను. పెట్టిన ఖర్చుకూడా రాలేదు. ఎకరాకు 3 క్వింటాళ్ల పత్తి దిగుబడి వచ్చింది. ప్రస్తుతం కిలో రూ.60 నుంచి రూ.65 కొనుగోలు చేస్తున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు రాలేదు.

– శివ, రైతు, వెంకయ్యకాలువగ్రామం

అవగాహన కల్పిస్తున్నాం



పత్తిసాగు చేసిన రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా దశల వారీగా పొలాలకు వెళ్లి తెగుళ్ల నివారణపై రైతులకు తెలియజేస్తున్నాం. ప్రకృతి వైపరీత్యం సహకరించకపోవడంతో తెగుళ్లు అధికమయ్యాయి.

–వ్యవసాయ అధికారి ఏవీ రామాంజులరెడ్డి, కొండాపురం

మస్తాన్‌స్వామి నూతన దర్గా ప్రారంభం

పెండ్లిమర్రి : మండలంలోని కొండూరు గ్రామంలో వెలసిన మస్తాన్‌స్వామి నూతన దర్గా ప్రారంభోత్సవం ఆదివారం ఆలయ కార్యనిర్వాహకులు ప్రారంభించారు. ఉరుసు మహోత్సవం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం స్వామివారికి గంధం కార్యక్రమం, రాత్రి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కోలాటం పలువురిని అకట్టుకుంది. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ అవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలి

ముద్దనూరు : క్రిస్మస్ పర్వదిన వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని స్థానిక ఎస్ఐ మైనుద్దీన్ సూచించారు. ఆదివారం ఎల్ఎం కాంపౌండ్‌లోని చర్చి ఆవరణలో ఎస్ఐ క్రైస్తవ మత పెద్దలతో మాట్లాడుతూ క్రిస్మస్‌ను ఆహ్లాదంగా, ఆటపాటలతో క్రైస్తవ సోదరులు జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో పాస్టర్ జేడీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పటి గురువులను సన్మానించుకుని ఆప్యాయంగా పలకరించుకున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం ఆటపాటల్లో మునిగి తేలారు. కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో చదివిన 1992–1993 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం అదివారం జరిగింది. ఈ సందర్భంగా 31 సంవత్సరాలు తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులలో మృతి చెందిన కొందరి స్నేహితులకు సంతాపం తెలిపారు.


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇష్టంతో సాధన చేస్తే చరిత్ర సృష్టించగలం


శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏఎంఎస్ కుమార్‌స్వామి గుప్తా

వేంపల్లె : గణిత శాస్త్రాన్ని ఇష్టంతో సాధన చేస్తే చరిత్ర సృష్టించగలమని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏఎంఎస్ కుమార్‌స్వామి గుప్తా తెలిపారు. ఆదివారం గణిత దినోత్సవం సందర్భంగా ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ గణిత శాస్త్ర రంగంలో తనకంటూ విశిష్టమైన స్థానాన్ని సాధించుకున్న మేధావి శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు.

కేంబ్రిడ్జి యూనివర్సిటీ నుంచి 'బ్యాచ్ లర్ సైన్స్ బై రీసెర్చి' అవార్డును అందుకున్న గొప్ప వ్యక్తి అన్నారు. ప్రతి వ్యక్తి నిజ జీవితంలో మ్యాథ్స్ తో సంబంధం ఉంటుందని మ్యాథ్స్ పట్ల భయాన్ని వీడి ఇష్టంతో సాధన చేయాలని తెలిపారు. అనంతరం గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను వివరించారు. ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది విద్యార్థులు అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి రవి కుమార్, డీన్ అకాడమిక్ రమేష్, గణి త విభాగాధిపతి డాక్టర్ రుద్రరవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకోవాలి


కమలాపురంలో పేద వితంతువులకు చీరలు పంపిణీ చేస్తున్న డీసీ సాల్మోన్ బాబు


పులివెందులలో నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న లయోలా కళాశాల ప్రిన్సిపాల్ అమల్‌రాజ్

కమలాపురం : పేద ప్రజలు సైతం క్రిస్మస్ పండుగ సంతోషంగా జరుపుకోవాలని స్థానిక సీఎస్ఐ చర్చి ఫ్లాసర్, కమలాపురం డివిజనల్ చైర్మన్ రెవ.యు. సాల్మోన్ బాబు తెలిపారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఆదివారం స్థానిక సీఎస్ఐ చర్చిలో సంఘ పెద్దలు, సంఘ సభ్యుల సమక్షంలో పేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగుల కార్యాలయంలో ఆదివా రం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయోలా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మదర్ థెరిస్సా చిత్ర పటానికి లయోలా ఫాదర్ అమల్‌రాజ్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ లయోలా కళాశాల పూర్వపు విద్యార్థి సందీప్‌రెడ్డి ఆర్థిక సాయంతో లయోలా విద్యార్థులు 30 మంది వికలాంగులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో కళాశాల అద్యాపకులు శివగంగాధర్, లక్ష్మీనారాయణ, వికలాంగులనెట్ వర్క్ అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ తరగతులు

వైవీయూ: ఆత్మస్థైర్యం గల యువత తయారుకావాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వసతి గృహ విద్యార్థినులకు వారం రోజులపాటు ఇచ్చిన తైక్వాండో శిక్షణ ఆదివారం ముగిసింది. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో నైపుణ్యతను అవసరమైన సందర్భంలో ధైర్యంగా ఉపయోగించుకోవాలన్నారు. పీజీ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ధైర్యవంతులైన అమ్మాయిలు సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని ముందుకెళ్ల గలుగుతున్నారని పలువురి గురించి ఉదహరించారు. తైక్వాండో నిపుణులు నాగూర్‌బాబు మాట్లాడుతూ చేసే పనిని ఒక యజ్ఞంలా భావించాలని, శ్రద్ధ, ఓర్పు, సహనం జీవితంలో భాగం కావాలన్నారు. అనంతరం శిక్షణా నిపుణులు నాగూర్ బాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జొన్న పంటకు తుపానుల ఎఫెక్ట్


నెమళ్లదిన్నెలో సాగు చేసిన తెల్లజొన్న పంట


పెద్దపసుపులలో సాగు చేసిన పచ్చజొన్న పంట

పెద్దముడియం : చలి కాలం కావడంతో పొగ మంచు తీవ్రంగా కురుస్తోంది. దీనికి తోడు వరుస తుపానుల కారణంగా నెల రోజుల నుంచి అప్పుడప్పుడు చినుకులు రాలుతున్నాయి. దీంతో మండల పరిధిలో సాగైన జొన్న పంటలు దెబ్బతినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో బిస్కెట్ల తయారీలో ఉపయోగించే రకం జొన్న పంటను అధికంగా సాగు చేశారు. మండలంలో హైబ్రిడ్ రకం, ఫీడ్స్ రకం తెల్లజొన్నలు, పచ్చ జొన్న పంటలను దాదాపుగా 1500 ఎకరాలలో సాగు చేశారు. సాయంత్రం నుంచి పొగ మంచు మొదలై అర్ధరాత్రి దాటిన తరువాత తీవ్రంగా మారుతోంది. ఉదయం ఎనిమిది గంటలైనా విడవకపోవడంతో మంచు బిందువులకు గింజలు నల్లగా మారుతున్నాయి. అలాగే తుపాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో పంట మరింత దెబ్బతినే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

అభాగ్యులను ఆదుకోవడం మనందరి బాధ్యత


దుప్పట్లు అందజేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

వేంపల్లె : అభాగ్యులను ఆదుకోవడం మనందరి బాధ్యత అని మదర్ థెరెసా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం మదర్ థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు, సాయిబాబా గుడి, పులివెందుల రోడ్డు, బిఎస్ఎన్ఎల్ ఆఫీస్, రైతు మార్కెట్, గండక్షేత్రం తదితర ప్రాంతాల్లోని అభాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ యువకులు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకొచ్చి పేదలకు సహాయం చేయాలన్నారు. చలికాలంను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో వివిధ ప్రాంతాల్లో నిద్రిస్తున్న అభాగ్యులకు ప్రతి సంవత్సరం మా సేవా సమితి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఆర్గనైజేషన్ అవేర్నెస్ డెవలప్మెంట్ ప్రెసిడెంట్ నాగన్న, బిఎస్ఆర్ టెక్నికల్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్


పులివెందుల రూరల్ : నక్కలపల్లి స్టోరేజ్ ట్యాంక్ ప్రధాన పైప్ లైన్ పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పరిశీలించారు. రేపటి నుంచి యథావిధి గా పులివెందుల ప్రాంత ప్రజలకు నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పార్నపల్లి కిషోర్, ఖాదర్, కమిషనర్, ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల పరిరక్షణే ప్రధాన లక్ష్యం


ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యుల

ఎర్రగుంట్ల : హిందూ దేవాలయాల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా హిందూ దేవాలయ పరిరక్షణ కమిటీ పనిచేస్తుందని కమిటీ చైర్మన్ రామాంజనేయులు తెలిపారు. అదివారం పట్టణంలోని సుందరయ్య కాలనీ సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హిందువుల ఐక్యవేదికను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల దేవాలయాలను పరిరక్షణ చేయడానికి జిల్లాలోని ప్రతి మండలం నుంచి సభ్యులను ఎన్నుకున్నామన్నారు. ఈ కమిటీ ప్రధాన ఉద్దేశ్యం ప్రతి హిందువును ఏకదాటిపై నడిపించి మన హైందవ ధర్మాన్ని కాపాడమేనన్నారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్‌లు డాక్టర్ మారుతి శంకర్‌రెడ్డి, వి.సుబ్బిరెడ్డి, 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

దోమకాటుకు గురి కావద్దు


విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్దయ్య

పులివెందుల రూరల్ : దోమకాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహం–3లోని విద్యార్థులకు విషజ్వరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మలేరియా వ్యాధి ప్లాస్మోడియా అనే పరాన్న జీవి ద్వారా ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం ద్వారా వస్తుందన్నారు. 2 నుంచి 14 ఎళ్లలోపు పిల్లలు అ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. దోమ కాటుకు గురైన నాలుగు రోజుల నుంచి ఆరు రోజుల లోపు వ్యాధి లక్షణాలు కనిపిస్తాయన్నారు. బోధవ్యాధి క్యులెక్స్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈవ్యాధి ప్రాణంతకం కాక పోయినప్పటికీ తీవ్రమైన శారీరక మానసిక ఇబ్బందులను కలగజేస్తుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందు జాగ్రత్తగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ముమ్మరంగా మినుము పంట నూర్పిళ్లు


మినుము పంటను కోస్తున్న కూలీలు

పెద్దముడియం : మండలంలో మినుమ పంట సాగు చేసిన రైతులు ముమ్మరంగా మినుము పంట నూర్పిళ్లు చేస్తున్నారు. మండలంలో దాదాపు 1000 ఎకరాలలో మినుము పంటను రైతులు సాగు చేశారు. ఖరీఫ్ చివరలో సాగు చేసిన మినుము పంట వరుస తుపాన్‌లతో పంట దెబ్బతినింది. దీంతో ఎకరాకు కేవలం మూడు నుండి నాలుగు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. దీనికి తోడు బహిరంగ మార్కెట్‌లో రూ.8000 ధర పలుకుతుండటంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. సేద్యం ఖర్చులు, కూలీల ఖర్చులు, రసాయనిక ఎరువులు, పురుగు మందులు అన్నీ కలుపుకుని ఎకరాకు రూ.30000 పెట్టుబడి వస్తోందని తెలిపారు. కొందరు రైతులకు పెట్టుబడులు రాగా మరికొందరు రైతులు నష్టాలను చవిచూశారు.


యంత్రం ద్వారా నూర్పిళ్లు చేయిస్తున్న రైతులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న మినుములు


తూకం వేస్తున్న కూలీలు

వికలాంగులతో క్రిస్మస్ వేడుకలు

కమలాపురం : స్థానిక నిస్సీ ప్రాఫిటిక్ మినిస్ట్రీస్ ఆవరణలో వికలాంగుల మధ్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఆ చర్చి ఆవరణలో నిస్సీ ఫౌండర్ బ్రదర్ సునీల్‌దత్, స్వాతి దంపతుల ఆధ్వర్యంలో వికలాంగులు, అంధుల ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేయించి అందరికి పంచి పెట్టారు. అనంతరం వారికి అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిస్సీ యవ్వనస్తులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.